ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5



శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 21 జనవరి 2025

ఓ ఉదయమా.. ఉండిపోమా..

హిమపాతంలో చిక్కిన
ఉదయ భానుడు..
కాంతులు వెదజల్లేందుకు
తహతహలాడుతుంటే..
గజగజ వణికించే చలిలో..
లేపాక్షి బసవడు..
ధీమాగా కూర్చుంటే..
వీరత్వాన్ని ఒలకబోస్తుంటే..
శిల్పులు చెక్కిన
లేపాక్షి బసవన్నను చూసి..
అద్భుతం అంటూ..
ఆశ్చర్యపోతుంటారు..
ఈ ప్రకృతి చెక్కిన శిల్పాన్ని చూస్తే..
ఏమంటారో.. ఇంకేమంటారో..
మైమరచిపోయి.. అంటారేమో..
ఓ ఉదయమా.. ఉండిపోమా.. అని..

జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. 9గంటలైనా సూర్యకాంతి వెలువడలేదు. లేపాక్షిలోని దుర్గావీరభద్రస్వామి ఆలయం, నంది విగ్రహం మంచు పొరల్లో చిక్కుకుపోయాయి. నంది విగ్రహం వద్ద సూర్యకాంతి మెల్లమెల్లగా తారసపడటం పర్యాటకులను కనువిందు చేసింది. మంచుతెరల్లో చిక్కిన ఉదయ భానుడిని, లేపాక్షి బసవడిని చూసిన జనం మైమరచిపోయారు.

- లేపాక్షి/కదిరి/హిందూపురం అర్బన్ (ఆంధ్రజ్యోతి)



పొగమంచులో నంది విగ్రహం





కదిరి పట్టణంలో కమ్మేసిన పొగమంచు



పొగమంచులో హిందూపురంలోని అనంత పద్మనాభస్వామి ఆలయం

పెరిగిన టీడీపీ కుటుంబం

ఉమ్మడి జిల్లా ఓటర్లలో 27.72 శాతం మందికి సభ్యత్వం
శ్రీసత్యసాయి జిల్లాలో 30.54 శాతం
అనంతలో 25.09 శాతం
లక్షకుపైగా సభ్యత్వాలతో టాప్‌లో కళ్యాణదుర్గం
7

చెప్పండి.. వింటాం..!

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ
అనంతలో ఏకసభ్య కమిషన్ పర్యటన
వర్గీకరణను వెంటనే అమలుచేయాలి
మాదిగ సామాజికవర్గం వినతి



6

4.8 కిలోల గంజాయి స్వాధీనం

10 మంది అరెస్టు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కదిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'ఊరూరా గంజాయి' శీర్షికన ఈనెల 17వ తేదీన 'ఆంధ్రజ్యోతి' రెండ్రోజుల క్రితం ప్రచురించిన కథనంతో అధికారుల్లో చలనం వచ్చింది. దీంతో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. నంబులపూలకుంట సమీపంలోని కొత్త రోడ్డు వద్ద సోమవారం పదిమందిని అరెస్టు చేసి, వారి నుంచి 4.8 కేజీల గంజాయి ప్యాకెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గంజాయి పట్టివేత వివరాలను డీఎస్పీ శివనారాయణ వెల్లడించారు. రూరల్ సీఐ నాగేంద్ర పర్యవేక్షణలో ఎస్ఐ వలీబాషా, సిబ్బంది బృందాలుగా ఏర్పడి, తనిఖీలు చేపట్టారు. నంబులపూలకుంట కొత్త రోడ్డు వద్ద గుంపులుగుంపులుగా ఉన్న వ్యక్తుల వద్ద ప్లాస్టిక్ కవర్లను గుర్తించారు. పోలీసులను చూసి వారు పారిపోవడానికి ప్రయత్నించగా.. ఎస్ఐ, సిబ్బంది పట్టుకున్నారు. వారి వద్ద చిన్నచిన్న ప్యాకెట్లలో గంజాయి లభించింది. ఒక్కో ప్యాకెట్‌లో 400 గ్రా. గంజాయి ఉంచి, రూ.6వేలకు విక్రయిస్తున్నట్లు పోలీసు విచారణలో తేలింది. అరెస్టయిన వారిలో అరకు జిల్లాకు చెందిన అర్జున్, అన్నమయ్యజిల్లా కోసువారిపల్లికి చెందిన బాలాజీ, నంబులపూలకుంట మండలానికి చెందిన ఆవుల మల్లికార్జున, ఆవుల శివ, ఆవుల రవి, సాలిపాటి నగేష్, ఇడగొట్టు ప్రశాంత్, పఠాన్ జాఫర్, సాలిపాటి వెంకటరమణ, షేక్ అలీ ఉన్నారు. సమావేశంలో రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐ వలీబాషా, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణ



పోలీసులు పట్టుకున్న గంజాయి

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించండి

● బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి పథకం ప్రజలకు చేరేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం దశలవారీగా నెరవేరుస్తోందన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, రైతు భరోసా, కొత్తరేషన్ కార్డులు, పింఛన్లు, ఎన్టీఆర్ హౌసింగ్ తదితర పథకాలను త్వరలో అమలు చేస్తామన్నారు. ప్రజాదర్బార్‌లో ఏకంగా 525 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.

కియ సెల్ఫీ స్పాట్ పరిశీలన: పెనుకొండ రూరల్: కియ కార్ల పరిశ్రమ ఎదురుగా చేపట్టిన పార్కు సుందరీకరణ పనులను మంత్రి పరిశీలించారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి సెల్ఫీస్పాట్‌లో సెల్ఫీ తీసుకున్నారు.

బాధితురాలికి పరామర్శ: పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు గ్రామంలో నాలుగు రోజుల క్రితం వెంకటలక్ష్మి జుత్తు కత్తిరించి, చిత్రహింస పెట్టిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న మంత్రి సవిత మునిమడుగు గ్రామానికి చేరుకుని, వెంకటలక్ష్మిని పరామర్శించారు. అధైర్యపడొద్దనీ, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తేలేదనీ, కఠినంగా శిక్షిస్తామన్నారు.



కియ సెల్ఫీ స్పాట్‌ను పరిశీలిస్తున్న మంత్రి సవిత

ఫిర్యాదుల వెల్లువ

పుట్టపర్తిటౌన్, జనవరి20(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఏకంగా 251 వినతులు వచ్చాయి. వాటిని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పట్ల శ్రద్ధ చూపి, సకాలంలో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఫ్రీహోల్డ్ భూముల పరిశీలనను వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి సంబంధించిన పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారధి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీపీఓలో..

పుట్టపర్తిరూరల్: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 65 ఫిర్యాదులు అందాయి. వాటిని ఎస్పీ రతన్న స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

మా కాలేజీలో... చేర్పించండి..!

● పరీక్షలకు రెండు నెలలు ముందే తల్లిదండ్రులకు ఫోన్ల గోల
● ముందుగా బుక్ చేసుకుంటే ఫీజు రాయితీ అంటూ బేరసారాలు
● ఫోన్ నంబర్లు ఇవ్వడంపై అభ్యంతరం

పది విద్యార్థులకు ప్రైవేటు వల



పరిగి మండలానికి చెందిన ఓ విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వారం క్రితం గుంటూరు నుంచి అమ్మాయి తండ్రికి ఫోన్ చేసి 'మీ అమ్మాయి ప్రభుత్వ పాఠశాలలో బాగా చదువుతోందని తెలిసింది. ముందుగానే మా కార్పొరేట్ కాలేజీలో సీటు బుక్ చేసుకుంటే రాయితీ ఇస్తామనీ, మేం ఊహించిన దానికంటే మార్కులు ఎక్కువ వస్తే మరింత రాయితీ కల్పిస్తామ'ని చెప్పారు. ఇలా.. పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు సంక్రాంతి సెలవుల ప్రారంభం నుంచి కాల్స్ వస్తూనే ఉన్నాయి.

హిందూపురంలోని డీఆర్ కాలనీకి చెందిన ఓ విద్యార్థిని ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. విద్యార్థిని తల్లికి వారం క్రితం విజయవాడ నుంచి ఫోన్ చేశారు. 'మీ అమ్మాయి పదో తరగతి చదువుతోంది. మా విద్యాసంస్థలో చేర్పించండి. మేం ఊహించినదానికంటే మార్కులు ఎక్కువ వస్తే.. మీ అమ్మాయికి ఫీజు మరింత తగ్గిస్తామ'ని చెప్పారు. తమ నంబరు ఎవరిచ్చారని విద్యార్థిని తల్లి మండిపడ్డారు.

లేపాక్షి మండలానికి చెందిన ఓ విద్యార్థి తండ్రికి నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. 'మీ అబ్బాయి అనంతపురంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. మా విద్యాసంస్థలో చేర్పిస్తే ఫీజు తగ్గిస్తామ'ని చెప్పారు.

హిందూపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఇంకా పదో తరగతి పరీక్షలకు దాదాపు రెండు నెలల వ్యవధి ఉంది. అప్పుడే కొన్ని జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు గాలంవేసి, పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వారం రోజులుగా కాలేజీల సిబ్బంది, మధ్యవర్తుల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేయిస్తూ తమ కళాశాలలో చేర్పించమని ఏవేవో కబుర్లు చెబుతూ విసుగొచ్చేలా చేస్తున్నారు. మార్చి 17 నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఆ నెలాఖరు వరకు పరీక్షల హడావుడి ఉంటుంది. ఆయా పరీక్షలకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఎంతో ఉత్కంఠగా ఉంటారు. ఇంకా పరీక్ష ప్రారంభం కాకనే జనవరిలోనే జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్లపై దృష్టి పెట్టాయి. విద్యార్థులకు వల వేస్తున్నాయి. దీంతో వివిధ పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థుల వివరాలు సేకరించినట్లు తెలిసింది. వాటి ఆధారంగానే విద్యార్థులను తమ కళాశాలలో చేర్పించాలంటూ ఫోన్లు చేస్తున్నారు. తమ కళాశాల మిగిలిన విద్యాసంస్థల కంటే గొప్పగా ఉంటుందనీ, ఐఐటీ, నీట్ సీట్లు సాధించామని ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడే సీటు రిజర్వ్ చేసుకుంటే రాయితీ ఉంటుందని పది పరీక్షలు, ఫలితాల తరువాతైతే మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుందని బేరసారాలు చేస్తున్నారు. కొన్ని కళాశాలలైతే ఫిబ్రవరిలోనే ఎంట్రెన్స్ టెస్ట్ ఉంటుందని అందుకు తీసుకురావాలని చెబుతున్నాయి. చాలా పాఠశాలలకు అనుబంధ కళాశాలలు ఉండటంతో ఎలాగైనా తమ విద్యార్థులు బయటకు వెళ్లకుండా ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో పదో తరగతి చదువుకున్న విద్యార్థులకు సెలవుల్లో కూడా పాఠాలు చెబుతున్నారు.

రెండు నెలలు ముందుగానే..

పదో తరగతి పరీక్షలు ప్రారంభానికి ఇంకా రెండు నెలల ముందుగానే విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల నుంచి ఫోన్ల ఒత్తిడి పెరుగుతోంది. ఫలితాలు రావడానికి కనీసం నాలుగు నెలల వ్యవధి ఉంటుంది. అయినా కొన్ని కళాశాలలు అడ్వాన్స్ అడ్మిషన్లు చేసుకుంటామనీ, ఇప్పటికే పలువురు విద్యార్థులు చేరారని చెబుతున్నాయి. అడ్వాన్స్ ఫీజులు కూడా చెల్లించాలనీ, ఆలస్యమైతే తమ కళాశాలలో సీటు దొరకడం కష్టమని చెప్పుకుంటున్నారు. పదో తరగతి పరీక్షలు అయిపోయిన వెంటనే ఆన్‌లైన్ క్లాసులు ప్రారంభిస్తామని సమాచారం ఇస్తున్నారు. ఇందులో కమీషన్ల కోసం కొంతమంది పాఠశాలల ఉపాధ్యాయులు.. విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లను కళాశాలల యాజమాన్యాలకు పంపుతున్నట్లు తెలుస్తోంది.

ఆ లీకులు ఎక్కడి నుంచి..?

సాధారణంగా పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన డేటా విద్యార్థుల వద్దే ఉంటుంది. పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్నపుడు ఆధార్, తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు అందులో పొందుపరిచి ఉంటారు. ఇందులో ఆ డేటా ప్రైవేటు కళాశాలలకు ఎలా వెళ్లిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో కొంతమంది ముందస్తుగా కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు ఫోన్ నంబర్లు ఇచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. ఏది ఏమైనా పరీక్షలకు రెండు నెలలు ముందుగానే ఫీజు రాయితీ అంటూ బేరసారాలు ఆడుతుండడంతో చదువుకంటే ఫీజులపైనే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టమవుతోంది.

వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దేవళ్ల మురళి



దేవళ్ల మురళిని సన్మానిస్తున్న కుంచెపు వెంకటేష్ తదితరులు

అనంతపురం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి ఎంపికయ్యారు. శ్రీశైలంలోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో సోమవారం రాష్ట్ర స్థాయి వడ్డెర్ల సంఘాల నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన దేవళ్ల మురళిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వడ్డెర్ల సంఘం అనంత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్, నాయకులు సుధాకర్, మంజునాథ్, వెంకట రాముడు, లక్ష్మన్న, అంజినప్ప తదితరులు దేవళ్ల మురళికి పూల మాలలు వేసి సన్మానిం చారు. సంఘం పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా దేవళ్ల మురళి మాట్లాడుతూ... వడ్డెర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతానని పేర్కొన్నారు.

మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి మార్గదర్శకాలు జారీ

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల తరహాలో మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరి-బి) సీట్లను భర్తీ చేయాలని స్పష్టత ఇచ్చింది. అగ్రికల్చర్ బీఎస్సీ(ఆనర్స్)లో కేటగిరి బీ కింద మిగిలిపోయిన సీట్లను మొదట ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారితో భర్తీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంటర్మీడియట్ బైపీసీలో 45%పైగా మార్కులు వచ్చిన ఓసీలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 40%పైన మార్కులు వచ్చిన వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఖాళీలు ఉంటే మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

రెండో విడత ఎన్నికలు

అనంతపురం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో విడతలో 28 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాతిలకు పాలక వర్గం ఎన్నికలు జరిగాయి. రెండో విడతలో 36 సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నింది. సరైన రికార్డులు లేని కారణంగా ఆరు సంఘాలను ఎన్నికలు నిర్వహించలేదు. ఆత్మకూరు మండలం కుర్లపల్లి, గుమ్మఘట్ట మండలం గోళ్లపల్లి సంఘాలకు వెటర్నరీ డాక్టర్లు సెలవులో ఉండటంతో ఎన్నికలు నిర్వహించలేదు. ఈ రెండు సంఘాలకు ఈ నెల 22న ఎన్నికలు నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. మూడో విడతలో ఈ నెల 25వ తేదీన 35 సంఘాలకు, నాలుగో విడతలో ఫిబ్రవరి 2వ తేదీన 14 సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

పేదింటి దొడ్డ గుణం

వైద్య కళాశాలకు భర్త మృతదేహాన్ని అప్పగించిన భార్య



భర్త మృతదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తున్న లక్ష్మి

అనంతపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దానం చేసే మనసుకు పేదరికం అడ్డుకాదని, దొడ్డ గుణాన్ని చాటుకుంది ఓ మహిళ. భర్తను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్నా సమాజహితం కోసం పరితపించింది. ఆమె రూరల్ మండలం ప్రభాకర్‌చౌదరి కాలనీకి చెందిన లక్ష్మి. చదువు సంధ్యలు, పిల్లలు లేని ఆమె భర్త శంకర్‌రెడ్డి(60)తో కలిసి బేల్దారి పనులకు వెళ్లేది. భార్యభర్తలు ఒకరికొకరు తోడుగా జీవన పయనం సాగిస్తున్న సమయంలో తీవ్రమైన కడుపునొప్పితో ఈ నెల 8న శంకర్‌రెడ్డి జిల్లా సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని ప్రభాకర్‌చౌదరి కాలనీకి తరలించారు. అంత్యక్రియల కోసం పలువురిని ఆమె సాయం అర్థించింది. ఈక్రమంలోనే సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయి అక్కడికి వెళ్లి మృతదేహాన్ని వైద్య కళాశాలకు దానం చేస్తే వైద్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని మృతుడి భార్య లక్ష్మికి వివరించాడు. ఆమె పెద్దమనసుతో అందుకు అంగీకరించి, కళాశాల వరకు వచ్చి మృతదేహాన్ని అప్పగించారు. ఆమెను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు అభినందించారు.

మా బతుకులు మార్చండి

మెడికల్ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు



ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీలు

అనంతపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'అనేక సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నాం. అయినా ప్రతినెలా జీతాలు ఇవ్వరు. ఉద్యోగ భద్రతలేదు. ఎన్నిప్రభుత్వాలు మారినా మా బతుకులు మారడం లేదు. ఇప్పుడైనా మార్చండి' అంటూ మెడికల్ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వైద్య కళాశాల పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు పెద్దఎత్తున జిల్లాకేంద్రంలో ఆందోళన చేపట్టారు. తొలుత జిల్లా ఆస్పత్రి నుంచి అనంతపురం ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు తరలివచ్చి జేసీ శివనారాయణ శర్మను కలిసి, వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఆకుటుంబాలు ఎలా బతకాలని మడిపడ్డారు. ఈపీఎఫ్, ఈఎస్ఐలు కూడా చెల్లించకుండా మోసం చేస్తున్నారన్నారు. జీతాలు ఇవ్వకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్న సంబంధిత ఏజెన్సీపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడు, నతర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నాయకులు మనోహర్, చిరంజీవి, నల్లమ్మ ప్రశాంత్, భార్గవి, శోభారాణి, హమీదవన్నూర్, స్వరూప, నారప్ప పాల్గొన్నారు.

30న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నారు. జడ్పీలోని ప్రధాన సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని జడ్పీ చైర్మన్, మంత్రులు, జడ్పీ వైస్ చైర్మన్లు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర కార్పొరేషన్ల చైర్మన్లు, అన్ని శాఖల అధికారులకు సమాచారం అందించారు.

చెప్పండి.. వింటాం..!

- ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ
- జిల్లాలో ఏకసభ్య కమిషన్ పర్యటన
- కలెక్టరేట్‌లో ఎస్సీల వినతుల స్వీకరణ
- సుప్రీం తీర్పును వెంటనే అమలు చేయాలి
- మాదిగ సామాజికవర్గం వినతి
- వర్గీకరణ రాజకీయ ప్రేరేపితం
- మాల సామాజికవర్గం అభ్యంతరం

అనంతపురం టౌన్/సెంట్రల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై ఆయా సామాజికవర్గాల ప్రజలు, సంఘాల నాయకుల అభిప్రాయాలను సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ జిల్లాలో పర్యటించింది. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఏకసభ్య కమిషన్, విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం అభిప్రాయాలను తెలుసుకుని, వినతి పత్రాలను స్వీకరించింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఎస్సీ ఉప కులాల సంఘాల నాయకులు, కులాల ప్రతినిధులు తరలివచ్చారు. రాజీవ్ రంజన్ మిశ్రాతోపాటు అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తదితరులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ వినతి పత్రాలను సమర్పించారు. వినతిపత్రాలు ఇచ్చేందుకు వచ్చినవారికి అధికారులు అనేక ప్రశ్నలు వేస్తూ, వారి అభిప్రాయాలను రికార్డు చేసుకున్నారు.



మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా, చిత్రంలో రెండు జిల్లాల కలెక్టర్లు, అధికారులు

అక్షరాస్యులు 2.90 లక్షల మంది

ఉమ్మడి జిల్లా జనాభాలో ఎస్సీలు 14.29 శాతం ఉన్నారు. వీరిలో 2.90 లక్షలమంది మాత్రమే చదువుకున్నారు. మిగిలిన వారు నిరక్షరాసులు. 2014-2025 మధ్య పదో పదవ తరగతి వరకూ చదువుకున్న విద్యార్థుల్లో మాదిగలు 1,44,006 మంది, మాల, మాల అయ్యవారు 20,473 మంది, ఆది ఆంధ్ర 445 మంది ఉన్నారు. చమర్, మౌచి, ముచ్చి 139 మంది, మాల దాసరి 1688, హోలియా దాసరి ఒకరు ఉన్నారు. డామ్, దొమ్మర, పైడి, పానో ఐదుగురు, అరయ్‌మాల 231 మంది, అర్వమాల ఒకరు ఉన్నారు. బరికి ఐదుగురు, ఆది ద్రావిడ 15, జగ్గలి ఐదుగురు, చాలవాడి 18, ముండాల ఒకరు, డక్కల్, డొక్కల్‌వార్ 45 మంది, మాదిగ దాసు, మస్టీ ఇద్దరు, మహర్ ఒకరు, మలసాలి, నెట్కానివారిలో ఇద్దరు చదువుకున్నారు. పాకీ, మోటి, తోటి, వల్లువాన్ కులాల్లో ఒక్కరు కూడా పదోతరగతి చదివిన వారు లేరు. ఇంటర్మీడియేట్ 92,096 మంది, పాలిటెక్నిక్, ఐటీఐ 16,759 మంది, డిగ్రీ 1,02,720 మంది, ఇంజనీరింగ్, ఫార్మసీ, ట్రిపుల్ ఐటీ 27,019 మంది విద్యార్థులు అడ్మిషనన్ అయ్యారు.

ఉమ్మడి జిల్లాలో ఎస్సీలు

కులాలు 49
జనాభా 5.83 లక్షలు
పురుషులు 2.92 లక్షలు
స్త్రీలు 2.90 లక్షలు
అక్షరాస్యులు 2.90 లక్షలు
ఉద్యోగులు 48,080

ఇదీ జనాభా

ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ జనాభాలో కులాలవారీగా మాదిగలు 4,75,632 మంది, మాలలు 73,525 మంది ఉన్నారు. ఆది ఆంధ్రా 5,802 మంది, మాదాసి కురువ 786 మంది, చమర్, మౌచి, ముచ్చి 741, మంది, మాలదాసరి 430 మంది, హోలియ దాసరి 409 మంది, డామ్, దొమ్మర, పానో 342 మంది, అరయ్ మాల 285, అర్వమాల 283 మంది ఉన్నారు. బరికి 197, ఆది ద్రావిడ 189, జగ్గలి 121, చాలవాడి 83, ముండాల 81, వలువాన్ 64, డక్కల్, డొక్కల్‌వార్ 61 మంది ఉన్నారు. పాకి, మోటి, తోటి 54 మంది, దోర్ 48, యల్లమలవార్ 43, మాదిదాసు, మస్టీన్ 39, మస్నీ 31, గోసంగి 25, జాంబువులు 24 మంది ఉన్నారు. హోలయ 18, మాలసన్యాసి 13, చచాటి 12, మహర్ 11, మాలసాలి, నెట్కాని 11, మాలజంగం 9 మంది ఉన్నారు. అరుంధతీయ 6, చంబర్ 6, దండాసి 5, మస్టీ 5, మటంగి 5, బయగారా, బయగారి 4, మాలదాసు 4, గాసి, హడ్డి 3, పామిడి 3, సిందోళ్ళ, చిందోళ్ల 3, యటల 3, అనాముక్ 2, బైండ్ల 2, మాంగ్ 2, మెహ్తార్ ఇద్దరు ఉన్నారు. మాలహనయ్, మాలమస్టీ, సాంగారా, సంబన్ ఒక్కొక్కరు ఉన్నారు.

స్పష్టమైన సమాచారం ఇవ్వండి: కమిషన్

ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్ర సమాచారాన్ని స్పష్టంగా ఇవ్వాలని ఏకసభ్య కమిషన్ విశ్రాంత ఐఏఎస్ రాజీవ్‌రంజిత్ మిశ్రా ఉమ్మడి అనంతపురం జిల్లా అధికారులను ఆదేశించారు. అభిప్రాయ సేకరణ ముగిసిన తరువాత ఆయన కలెక్టర్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ సామాజికవర్గ ఉద్యోగుల వివరాలు, విద్యార్థుల వివరాలు, గ్రూప్1, 2 గ్రూప్ 3, 4 అధికారులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు, సంక్షేమ పథకాలు(జనాభా నిష్పత్తిలో) తదితర వివరాలను ఆయన కోరారు. ఇప్పటికే తయారు చేసిన నివేదికను రెండు జిల్లాల కలెక్టర్లు కమిషన్‌కు అందజేశారు.



సమస్యలను నోట్ చేసుకుంటున్న రాజీవ్‌రంజన్‌మిశ్రా

వెంటనే అమలు చేయండి

ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ కోసం ఎదురు చూస్తున్నామని, సుప్రీం కోర్టు తీర్పును వెంటనే అమలుచేసి తమకు న్యాయం చేయాలని మాదిగ సంఘాల నాయకులు, ఆ సామాజికవర్గ ప్రజలు కోరారు. మాదిగల చరిత్రను ఏక సభ్య కమిషన్‌కు వివరించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కోరారు.



వర్గీకరణతోనే న్యాయం అంటూ మోకాళ్లపై కూర్చొని వేడుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాకూ న్యాయం చేయండి..

తాము ఎస్సీ జాబితాలో ఉన్నామో లేదో తెలియడం లేదని బుడగ జంగాల సామాజికవర్గం వారు కమిషన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్‌పై స్పష్టతలేక తమ పిల్లలు చదవలేకపోతున్నారని, తమకు న్యాయం చేయాలని విన్నవించారు. తమకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ అయ్యేలా చూడాలని కోరారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆ సామాజికవర్గం నాయకులు ఏకసభ్య కమిషన్‌కు విన్నవించారు.



కంటతడిపెట్టి చెబుతున్న బుడగజంగాల నాయకుడు

ఇవీ గణాంకాలు

ఏకసభ్య కమిషన్‌కు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఎస్సీల గణాంకాలతో పూర్తిస్థాయి నివేదికను అందజేశారు. నివేదికలో కులాలు, కులాలవారీగా జనాభా, స్త్రీ, పురుషులు, ఉద్యోగులు, అక్షరాశ్యులు, నిరక్షరాశ్యుల తదితర అంశాలను పొందుపరిచారు. 2011 గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లా జనాభా 40.81 లక్షలు. ఇందులో ఎస్సీలు 5.83 లక్షల మంది. వీరిలో పురుషులు 2.92 లక్షల మంది, స్త్రీలు 2.90 లక్షల మంది ఉన్నారు. ఎస్సీ విభాగంలో 49 కులాలు ఉన్నాయి. ఇందులో మాదిగ, మాల జనాభా అత్యధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో 48,080 మంది ఎస్సీలు ప్రభుత్వ శాఖల్లో 2014-24 మధ్య ఉద్యోగాలు పొందారు.

48,080 మంది ఉద్యోగులు

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 48,080 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నారు. 2014-24 మధ్య కులాల వారిగా గ్రూప్1, 2, 3, 4 కేడర్లలోనూ, క్లాస్-4, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వీరు ఉద్యోగాలు పొందినట్లు నివేదికలో పేర్కొన్నారు. కులాలవారిగా మాదిగలు 31,884 మంది, మాలలు 14,298 మంది, ఇతరులు 1,898 మంది ఉద్యోగాలలో ఉన్నారు. నివేదికలో వరుస సంఖ్య 29, 41లో టెక్నికల్ ఎడ్యుకేషన్ పాలిటెక్నిక్ కళాశాలలు, 14, 34 వరుస సంఖ్యలో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌ను రెండు సార్లు చూపించింది.

వర్గీకరణ వద్దు..



మాట్లాడుతున్న మాలలు

వర్గీకరణ అన్యాయమని, రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్సీల మధ్య చిచ్చు పెడుతున్నారని మాల సామాజికవర్గం నాయకులు, ఆ కుల సంఘాల నాయకులు కమిషన్‌తో అన్నారు. రిజర్వేషన్‌లు పెంచి ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలను సమర్పించారు.

పాడి పడకుండా..!

- పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- సబ్సిడీపై మినీ గోకులాల మంజూరు

నామమాత్రంగా రైతు వాటా



సంజీవపురంలో నిర్మించిన మినీగోకులం షెడ్డు

గార్లదిన్నె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు, గొర్రెలు, మేకల కాపరులకు రాయితీతో ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులం షెడ్లు వరంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకదార్లు తడకలు, కట్టెలతో చిన్న చిన్న పాకలు నిర్మించుకుని అందులో జీవాలను ఉంచేవారు. దీంతో కొన్ని జీవాలు వానాకాలంలో వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ రోగాల బారినపడి మృతి చెందేవి. పాడి రైతులు రూ.లక్షల్లో నష్టపోతుండేవారు. ఈనేపథ్యంలో పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడంతో పాటు పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే రాయితీతో మినీ గోకులం షెడ్లు మంజూరు చేసింది. ఐదెకరాలలోపు భూమి ఉన్న చిన్న సన్నకారు రైతులకు ఈ అవకాశం కల్పించింది.

షెడ్డును బట్టి నిధులు

రెండు పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.1.15 లక్షలు కేటాయించారు. ఇందులో ఉపాధి నిధులు రూ. 103500, రైతు వాటా రూ. 11500లుగా నిర్ణయించారు. నాలుగు పశువుల షెడ్డు యూనిట్‌కు రూ. 1.85లక్షలుగా నిర్ణయించారు. ఇందులో ఉపాధి నిధులు రూ. 166500, రైతు రూ. 18500 చెల్లించాలి. ఆరు పశువుల షెడ్డు యూనిట్‌ను రూ.2.3 లక్షలుగా నిర్ణయించారు. ఉపాధి నిధులు రూ.207000, రైతు వాటా రూ. 23వేలు గా నిర్ణయించారు. 20 గొర్రెలు, మేకలు షెడ్డు యూనిట్‌కు రూ.1.3లక్షలు నిర్ణయించారు. ఇందులో ఉపాధి నిధులు రూ.91వేలు, రైతు వాటా రూ. 39వేలుగా ప్రకటించారు. 50 గొర్రెల యూనిట్ రూ.2.3లక్షలు, ఉపాధి నిధులు రూ.1.6లక్షలు, రైతువాట రూ. 69వేలుగా నిర్ణయించారు. 100 కోళ్ల షెడ్ రూ. 87వేలు, ఉపాధి నిధులు రూ. 60900, రైతువాటా రూ. 26వేలు, 200 కోళ్లషెడ్డుకు రూ. 1.32లక్షలు, ఉపాధినిధులు రూ. 92400, రైతు వాటా రూ. 39600 ఇలా యూనిట్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. పశువులు షెడ్ నిర్మాణాలకే రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మండలంలో వందకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి మండలానికి సుమారు 46 మినీ గోకులం షెడ్లు రాగా, ఇప్పటి వరకు దాదాపు 26 షెడ్ల నిర్మాణాలు పూర్తి అయినట్లు తెలిపారు. మిగిలిన షెడ్లు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం.

పశువులు సురక్షితం



మినీగోకులం షెడ్లలో పశువులు సురక్షితంగా ఉంటాయి. గతంలో షెడ్డు నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక టెంకాయ పట్టలతో కొట్టం వేసుకున్నాం. ఎండకు, వానకు తడిసి పశువులు అనారోగ్యానికి గురవుతుండేవి. గతంలో మా ఆవు మృతి చెందడంతో సుమారు రూ.40వేలు నష్టపోయాం. ప్రస్తుతం ఐదు ఎనుములున్నాయి. ప్రభుత్వం సబ్సిడీతో ప్రవేశపెట్టిన మినీగోకులం షెడ్లు పాడిరైతులకు వరం.

\- నర్రిశెట్టి స్వాతి, మహిళా రైతు, సంజీవపురం

పాడి రైతులకు వరం



మండలంలో చిన్న, సన్నకారు రైతులు అధిక సంఖ్యలో పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. సొంతంగా షెడ్లు నిర్మించుకోవాలంటే సుమారు రూ. రెండు లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. ప్రస్తుతం మాకు 5 ఎనుములు, ఒక ఆవు ఉంది. వీటికి సొంతంగా షెడ్డు నిర్మించాలంటే దా దాపు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఈ క్రమంలో పాడిరైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం మినీగోకులం షెడ్లు మంజూరు చేసి చేయూతనందిస్తోంది.

\- బుల్లే రామకృష్ణ, గార్లదిన్నె

వేగంగా షెడ్ల నిర్మాణం

మినీ గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు పాడి రైతులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నా రు. మండలానికి 46 ఉండగా 100కు పైగా దరఖాస్తులు వచ్చాయి. షెడ్లు మంజూరైన రైతులందరు నిర్మాణాలు వేగవంతం చేసుకుంటున్నారు. మొదటి విడతలో రాని రైతులకు రెండో విడతలో వస్తాయి. మినీగోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి అయిన వాటికి బిల్లులు కూడా మంజూరవుతున్నాయి.

\- యోగానందరెడ్డి, ఎంపీడీఓ

రంజీ జట్టులో వినయ్‌కు చోటు



అనంతపురం క్లాక్ టవర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా రంజీ జట్టుకు జిల్లాకు చెందిన వినయ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన విజయహజారే ట్రోఫీ, సయ్యద్‌ముస్తాక్ అలీ ట్రోఫీలలో మెరుగైన ప్రతిభ చాటిన వినయ్‌కుమార్‌కు ఆంధ్రా రంజీ జట్టులో చోటు కల్పించారు. రంజీ జట్టులో చోటు సాధించిన వినయ్‌కుమార్‌కు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

నవోదయ హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

లేపాక్షి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ పాఠశాల 9వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 2025-26 సంవత్సరానికి 1084మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఫిబ్రవరి 8న జవహర్ నవోదయ విద్యాలయం లేపాక్షి, ఏపీఆర్‌జేసీ స్కూల్‌నందు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా 11వ తరగతిలో ప్రవేశం పొందేందుకు 1228 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరికి ఫిబ్రవరి 8న హిందూపురంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాల్‌టిక్కెట్ల కోసం వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

క్రైం కార్నర్

పగలే చోరీ

● 47 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

పెనుకొండ టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణమ్మ కాలనీ సమీపంలో సోమవారం పట్టపగలే ఇంట్లో దొంగలు పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగార్జున, జ్యోతిలత దంపతులు ఉపాధ్యాయులు. నాగార్జున పెనుకొండ మండలం గుట్టూరు హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. జ్యోతిలత బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఇరువురు సోమవారం విధులకు వెళ్లారు. దీనిని అదునుగా భావించిన దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. నగలు, నగదు అపహరించారు. సాయంత్రం తిరిగొచ్చిన ఉపాధ్యాయ దంపతులు చూసేసరికి ఇంట్లో బీరువా తెరిచి ఉంది. అందులోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. చోరీ అయినట్లు గ్రహించారు. 47 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ అయినట్లు బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితంలేని మహిళ అదృశ్యం

అనంతపురం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. నగరంలోని అశోక్‌నగర్‌లో నివాసముంటున్న ఉషారాణి అనే మహిళ కు చిన్నప్పటి నుంచి మతిస్థిమితం ఉండేది కాదు. అప్పుడప్పుడు ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చేది. ఈ క్రమంలో ఈనెల 15న రాత్రి 8గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

అనంతపురం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వినాయక్‌నగర్‌లో చాకలి శ్రీనివాసులు, యాస్మిన్ (27) దంపతులు నివాసముంటు న్నారు. వీరు 10ఏళ్ల కిందట ప్రేమవివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. ఇంటి ఆర్థిక పరిస్థితుల్లో మార్పు రావడం, అప్పులెక్కువ కావడంతో ఈనెల 10న యాస్మిన్ కురులకు వాడే ద్రావకాన్ని తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో అనుమానాస్పద మృతి

అనంతపురం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన చాకలి అనిల్(28) నగరంలోని సాయినగర్ 2వ క్రాస్‌లోని మాక్‌నస్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడి డ్యూటీ ఉదయం 9 నుంచి రాత్రి 9గంటల వరకు ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లాడు. ఏం జరిగిందో తెలియదు. సోమవారం ఉదయం స్వీపర్ ఆ గదిలోకి వెళ్లే సరికి కుర్చీలో కూర్చుని కనిపించాడు. నిద్రపోతున్నట్లు భావించి ఆమె పిలిచింది. పలకకపోయే సరికి భయపడి సిబ్బందికి తెలియజేసింది. ఆసుపత్రి డాక్టర్ హర్షవర్ధన్ పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుండెపోటుతో మృతి చెందాడా..? ఏదైనా విషద్రావకం సేవించాడా..? అనేది తెలియాల్సి ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య భారతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం పట్టివేత

హిందూపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కొడికొండ-శిర జాతీయ రహదారిలోని కొల్లకుంట ఫ్లైఓవర్ వద్ద హర్యానా మద్యాన్ని ఎక్సైజ్ సీఐ రామ్మోహన్ సోమవారం తెలిపారు. సుబ్బిరెడ్డిపల్లికి చెందిన శ్రీనాథ్, ముద్దిరెడ్డిపల్లికి చెందిన బాలేంద్ర, నవీన్ కారులో హరియాణా రాష్ట్రానికి చెందిన సుమారు 90 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకుని, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. నిందితులను అరెస్టు చేశామన్నారు. పట్టుబడి మద్యం విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందన్నారు. దాడుల్లో ఈఎస్ గోవిందనాయక్, ఏఈఎస్ నరసింహులు, స్థానిక ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

యంగ్ ఇండియా రూపకర్త..

కన్నుమూత

● ఉపాధిహామీ హక్కుల ఉద్యమకారుడు నరేంద్రసింగ్ బేడీ మృతి

● వయోభారంతో తుదిశ్వాస



నరేంద్రసింగ్ బేడీ (ఫైల్)

హిందూపురం/పెనుకొం/తనకల్లు/చెన్నేకొత్తపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లాను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టిన యంగ్ ఇండియా ప్రాజెక్ట్ రూపకర్త నరేంద్రసింగ్ బేడీ (87) ఇకలేరు. వయోభారంతో పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలోని ఫాంహౌస్‌లో ఆయన సోమవారం ఉదయం కన్నుమూశారు. అనంతపురం జిల్లాలో పేదరిక నిర్మూలన, సుస్థిరత, మానవహక్కులు, గ్రామీణ జీవన ప్రమాణాల పెంపు, విద్య, వైద్యం, నీటి నిలువలు, ఇంకుడు గుంతలు, వలసల నివారణకు గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు చేయాలని ఆయన అలుపెరగని పోరాటం చేశారు. పంజాబ్‌లో జన్మించిన ఆయన 55ఏళ్ల క్రితం పెనుకొండ సమీపంలోని గుట్టూరులో యంగ్ ఇండియా ప్రాజెక్ట్ పేరిట స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజలు, రైతుల జీవనోపాధి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఉపాధి కల్పించారు. గ్రామాల్లో బావులు తవ్వించి, కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు రైతుల జీవనోపాధి కోసం సంస్థ కృషిచేస్తూ వచ్చింది. ఇంధన పొదుపు, సంప్రదాయేతర ఇంధన వనరుల పెంపకం, సేంద్రీయ, సుస్థిర వ్యవసాయం, ఉపాధి కల్పన, జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా అభివృద్ధి వైపు ఉత్తమ పౌర సమాజమే లక్ష్యంగా యంగ్ ఇండియా ప్రాజెక్ట్ పనిచేసింది. ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టడంలో బేడీది కీలకపాత్ర. వ్యవసాయ కూలీల యూనియన్లను ఏర్పాటుచేసి, వాటి ద్వారా ఎన్నో ఉద్యమాలు చేసి నిరుపేదలకు లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూమిని పంచడమేకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావాల్సిన సంక్షేమ పథకాలు అందేలా చేశారు. అనేక కార్యక్రమాల ద్వారా పేద ప్రజలను చైతన్యపరిచారు. దివ్యాంగులకు ప్రత్యేక నిధులను సమకూర్చి, వారికి కావాల్సిన పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళా సంఘాలను ఏర్పాటుచేసి, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులను చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలను పోటీ చేయించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు రాయలసీమ వ్యాప్తంగా సేవలను కొనసాగించిన ఘనత యంగ్ ఇండియా ప్రాజెక్టుకే దక్కుతుంది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) రాష్ట్రంలో అమలవుతోందంటే అందుకు యంగ్ ఇండియా ప్రాజెక్ట్ రూపకర్త నరేంద్రసింగ్ బేడీయే కారణమనడం అతిశయోక్తి కాదు. యంగ్ ఇండియా ప్రజెక్ట్‌లో పనిచేసిన అనేక మంది నేడు సొంతంగా స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసుకుని, ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.



బేడీ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న భార్య సోనియాబేడీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు

నేపథ్యం..

నరేంద్రసింగ్ బేడీ పంజాబ్‌లో జన్మించారు. బెంగాల్‌లోని డూన్ పాఠశాలలో చదివారు. అమెరికాలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆయనకు భార్య సోనియా బేడీ, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. మణిశంకర్ అయ్యర్, దిగ్విజయ్ సింగ్, ఎంఎస్ స్వామినాథన్.. ఆయన సమకాలికులు. భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ.. బేడీకి కళాశాలలో మూడేళ్ల జూనియర్. జాతీయ ఉపాధిహామీ చట్టం రూపకల్పనకు ప్రముఖ ఆర్థికవేత్త హనుమంతరావు తదితర మేధావులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలిసి పనిచేశారు. యంగ్ ఇండియాలో పనిచేసిన ఇద్దరు క్రియాశీలక సభ్యులు ఎంపీలు అయ్యారంటే సంస్థ పనితీరు ఎలా ఉంటుందో అర్థం అవుతుంది.

పలువురి సంతాపం

నరేంద్రసింగ్ బేడీ మృతి జిల్లా ప్రజలకు తీరనిలోటని పలువురు ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. డా.సురేష్‌బాబు, వెంకటశివారెడ్డి, ఓపీడీఆర్ రామ్‌కుమార్, లయన్స్‌క్లబ్ విరుపాక్షరెడ్డి, తాడికొండ సత్యనారాయణ, పాలినేని నాగేంద్రప్రసాద్, ఆర్‌ఈఎఫ్ రామచంద్ర, నాగభూషణం, రామకృష్ణ, పౌరహక్కుల సంఘం, ఎన్‌జీఓ నాయకులు బలరాం, కిష్టప్ప, వెంకటేశ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గంగిరెడ్డి, బలరాం తదితరులు నివాళులు అర్పించారు.

బేడీ మృతి తీరనిలోటు..

బుల్.. బుల్.. అని ప్రేమగా పిలుచుకునే నరేంద్ర సింగ్ బేడీ గ్రామీణాభివృద్ధి రంగంలో మార్గదర్శకుడిగా నిలిచారనీ, ఆయన మృతి తీరనిలోటు అని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మేరీ, బబ్లూ గంగూలీ పేర్కొన్నారు. నరేంద్రసింగ్ బేడీ మృతిచెందిన విషయం తెలిసిన వెంటనే వారు గుట్టూరు సమీపంలోని యంగ్ ఇండియా ప్రాజెక్ట్‌కు చేరుకున్నారు. ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. కరువు పీడిత రాయలసీమలో వేలాది మంది ప్రజల జీవన ప్రమాణాలను మార్చడంలో కీలక పాత్ర పోషించారన్నారు.

బేడీ మృతి బాధాకరం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య: నరేంద్ర సింగ్ బేడీ మృతి బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సోమవారం ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. యంగ్ ఇండియా ప్రాజక్ట్ ద్వారా ఆయన ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం అమలు చేయడంలో విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. జిల్లాకు ఆయన అందించిన సేవలు అపారమన్నారు. ఆయన కుటుంబీకులకు సీపీఐ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుందన్నారు.

ఉపాధి హామీ చట్టం రూపకల్పనలో బేడీ పాత్ర కీలకం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్:

యూపీఏ ప్రభుత్వం వ్యవసాయ కూలీల కోసం తెచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపొందించడంలో యంగ్ ఇండియా రూపశిల్పి నరేంద్రసింగ్ బేడీ పాత్ర కీలకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆయన ప్రారంభించిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు పేదల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. కరువు, రైతు ఆత్మహత్యలు, వలసలు జిల్లా గ్రామీణ జీవితాన్ని విచ్ఛిన్నం చేసినపుడు అనేక సంస్థలతో కలిసి వారికి తోడుగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన మృతికి సీపీఎం తరఫున నివాళులర్పిస్తున్నామన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

అడ్డు తొలగించుకునేందుకే హత్య

● ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

హిందూపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వివాహేతర బంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను భార్యే.. ప్రియుడితో కలిసి హత్య చేసింది. స్థానిక రహమత్‌పురానికి చెందిన అల్లాబకష్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. అల్లాబకష్ భార్య తబస్సుం, ఆమె ప్రియుడు నదీముల్లాను అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అరెస్టు వివరాలను టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం వెల్లడించారు. అల్లాబకష్‌కు తొమ్మిదేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం దొడ్డబళ్లాపురానికి చెందిన తబస్సుంతో వివాహమైంది. అల్లాబకష్ ఆటోనగర్‌లో బీరువాలు తయారుచేసే షాపులో పనిచేస్తుండేవాడు. రహమత్‌పురానికి చెందిన నదీముల్లా తోపుడుబండ్లపై కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. అతడితో తబస్సుంకు పరిచయం ఏర్పడింది. అదికాస్త వివాహేతర బంధానికి దారితీసింది. విషయం అల్లాబకష్‌కు తెలియడంతో భార్యను పలుమార్లు మందలించాడు. వివాహేతర బంధానికి అడ్డుపడుతున్నాడని భావించిన ఆమె.. భర్తను హతమార్చేందుకు ప్రియుడితో కలిసి పన్నాగం పన్నింది. ఆ మేరకు ఈనెల 18న తెల్లవారుజామున గాఢ నిద్రలో ఉన్న అల్లాబకష్ గొంతుకు చున్నీతో బిగించి, ఊపిరాడకుండా చేసింది. అందుకు ప్రియుడు సహకరించాడు. అల్లాబకష్ చనిపోయాడని నదీముల్లా అక్కడి నుంచి పరాయ్యాడు. కొద్దిసేపటి తరువాత అల్లాబకష్ సోదరికి తబస్సుం ఫోన్ చేసి, 'మీ అన్న ఆరోగ్యం సరిగాలేదనీ, వెంటనే రావాల'ని చెప్పింది. వారు వచ్చి చూసి, అనుమానం రావడంతో నిలదీశారు. దీంతో ఆమె నేరాన్ని ఒప్పుకుంది. అల్లాబకష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. ఆ మేరకు తబస్సుం, నదీముల్లాను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ

పెనుకొండ సబ్‌జైలు తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్

పెనుకొండ టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ సోమవారం పెనుకొండ సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులో వంటగది, స్టోర్‌రూం, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశం ఏర్పాటుచేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు శిక్ష పూర్తి చేసుకుని బయటకు వెళ్లాక సత్‌ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ అజర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చా యన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 15వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 46 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

803 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 803 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 454 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

పెరిగిన టీడీపీ కుటుంబం

● ఉమ్మడి జిల్లా ఓటర్లలో 27.72 శాతం మందికి సభ్యత్వం

● అత్యధికంగా శ్రీసత్యసాయి జిల్లాలో 30.54 శాతం

● అనంతలో 25.09 శాతం

● లక్షకుపైగా సభ్యత్వాలతో టాప్‌లో కళ్యాణదుర్గం

● ముగిసిన టీడీపీ సభ్యత్వ నమోదు

అనంతపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో తెలుగుదేశంపార్టీ జోరు చూపింది. ఉమ్మడి జిల్లా ఓటర్లలో 27.72 శాతం మంది ఆ పార్టీ సభ్యులుగా చేరారు. బీమా సౌకర్యం కల్పిస్తుంటం కూడా సభ్యత్వ నమోదుకు బాగా ఉపయోగపడింది. క్రియాశీల కార్యకర్తకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినా పార్టీ అండగా ఉంటుందనే భరోసాను ఆ పార్టీ అధిష్టానం కలిగిస్తోంది. ఇందులో భాగంగా ఇదివరకూ రూ. 2 లక్షలుగా ఉన్న బీమాను రూ. 5 లక్షలకు పెంచింది. కార్యకర్తలకు బీమా విషయంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌దే ముఖ్య భూమిక. ఉమ్మడి జిల్లాలో టీడీపీ సభ్యత్వాల నమోదు ప్రక్రియ దాదాపుగా ముగిసింది. రెండు నెలలుగా సభ్యత్వాల నమోదు ప్రక్రియ కొనసాగింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా ఓటర్లు 33,82,343 మంది ఉండగా... 9,37,745 మంది ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని తీసు కున్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలకుగానూ... లక్షకుపైగా సభ్యత్వాలు చేసి కళ్యాణదుర్గం టాప్‌లో నిలిచింది.

శ్రీ సత్యసాయి జిల్లాలోనే అత్యధికం

శ్రీసత్యసాయి జిల్లాలోనే అత్యధికంగా టీడీపీ సభ్యత్వాలు నమోదయ్యాయి. ఆ జిల్లాలో ఓటర్లు 16,35,029 మంది ఉండగా... అందులో 4,99,308 మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఇది 30.54 శాతంగా నమోదైంది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే... కదిరి 89,378 సభ్యత్వాలతో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తరువాత పెనుకొండ 83,581, రాప్తాడు 80,339, మడకశిర 66,827, పుట్టపర్తి 65,177, ధర్మవరం 62,031, హిందూపురంలో 51,975 సభ్యత్వాలు నమోదయ్యాయి. నియోజకవర్గాల్లోని ఓటర్ల వారీగా పరిశీలిస్తే... కదిరిలో 2,53,600 మంది ఓటర్లు ఉండగా 35.24 శాతం టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. పెనుకొండలో 2,33,306 మంది ఓటర్లు ఉండగా... 35.82 శాతం, రాప్తాడులో 2,46,472 మంది ఓటర్లుండగా 32.59 శాతం, మడకశిరలో 2,10,519 మంది ఓటర్లుండగా 31.74 శాతం, పుట్టపర్తిలో 2,09,684 మంది ఓటర్లు ఉండగా 31.08 శాతం, ధర్మవరంలో 2,33,490 మంది ఓటర్లు ఉండగా... 26.56 శాతం, హిందూపురం లో 2,47,958 మంది ఓటర్లుండగా... 20.96 శాతం మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్న వారిలో ఉన్నారు.

అనంతలో...

అనంతపురం జిల్లాలో 17,47,314 మంది ఓటర్లుండగా 25.09 శాతం మంది టీడీపీ సభ్యతం తీసుకున్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే... కళ్యాణదుర్గంలో 1,01,262 సభ్యత్వాలతో మొదటి స్థానంలో ఉండగా... మిగిలిన స్థానాల్లో రాయదుర్గం 78,413, అనంతపురం అర్బన్ 72,155, గుంతకల్లు 61,952, ఉరవకొండ 53,918, శింగనమల 47,592, తాడిపత్రి నియోజకవర్గంలో 23,145 మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. నియోజకవర్గాల్లోని ఓటర్ల వారీగా పరిశీలిస్తే... కళ్యాణదుర్గంలో 2,28,421 మంది ఓటర్లు ఉండగా 44.33 శాతం మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. రాయదుర్గంలో 2,63,219 మంది ఓటర్లుండగా 29.79 శాతం, అనంతపురం అర్బన్‌లో 2,77,156 మంది ఓటర్లుండగా... 26.03 శాతం, గుంతకల్లులో 2,64,745 మంది ఓటర్లుండగా... 23.40 శాతం, ఉరవకొండలో 2,19,996 మంది ఓటర్లుండగా... 24.50 శాతం, శింగనమలలో 2,45,851 మంది ఓటర్లుండగా... 19.35 శాతం, తాడిపత్రిలో 2,47,926 మంది ఓటర్లుండగా 9.33 శాతం మంది ఓటర్లు టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు.

శాశ్వత సభ్యత్వాల్లో అనంత టాప్...

ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో మొత్తం 43 మంది టీడీపీ శాశ్వత సభ్యత్వాలను పొందారు. ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. కాగా... పార్టీ శాశ్వత సభ్యత్వాల నమోదులో అనంత జిల్లా టాప్‌లో నిలిచింది. జిల్లాలో 31 మంది శాశ్వత సభ్యత్వాన్ని తీసుకోగా... శ్రీసత్యసాయి జిల్లాలో 12 మంది మాత్రమే శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే... కళ్యాణ దుర్గంలో 2, రాయదుర్గంలో 6, అనంతపురం అర్బన్‌లో 9, గుంతకల్లులో 6, ఉరవకొండలో 4, శింగనమలలో 3, తాడిపత్రిలో ఒకరు శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో కదిరిలో 2, మడకశిరలో 4, హిందూపురంలో 2, పెనుకొండ, రాప్తాడు, పుట్టపర్తి, ధర్మవరంలో ఒక్కొక్కరు చొప్పున పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు.

కొత్త వారే అధికం

ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో కొత్త వారికి అత్యధికంగా పార్టీ సభ్యత్వాన్ని ఇవ్వడంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చొరవ చూపారు. రెన్యువల్‌తో పాటు కొత్తగా అత్యధిక మందికి సభ్యత్వాన్ని ఇచ్చారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 60,486 మందికి, రాయదుర్గంలో 39,249 మందికి, అనంతపురం అర్బన్‌లో 55,817 మందికి, గుంతకల్లులో 40,542 మందికి, ఉరవకొండలో 30,123 మందికి, శింగనమలలో 25,838 మందికి, తాడిపత్రిలో 14,191 మందికి కొత్తగా పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,38,437 మందికి పార్టీ సభ్యత్వాన్ని ఇవ్వగా... అందులో రెన్యువల్ 1,72,191 పోగా... కొత్తగా 2,66,246 మందికి పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి నియోజకవర్గంలో 54,793 మందికి, పెనుకొండలో 51,578 మందికి, రాప్తాడులో 37,300 మందికి, మడకశిరలో 42,815 మందికి, పుట్టపర్తిలో 35,363 మందికి, ధర్మవరంలో 29,656 మందికి, హిందూపురంలో 29,344 మందికి కొత్తగా పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 4,99,308 మందికి పార్టీ సభ్యత్వం ఇవ్వగా... అందులో రెన్యువల్ 2,18,459 పోగా... మిగిలిన 2,80,849 మందికి పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చారు.

న్యూస్ బాక్స్

శ్రీశైలానికి బస్సు సర్వీసు

కదిరి అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కదిరి నుంచి శ్రీశైలానికి నూతన బస్సు సర్వీసును ప్రారంభించినట్లు డిపో మేనేజర్ మైనోద్దీన్ సోమవారం తెలిపారు. ప్రతి రోజూ రాత్రి 7.30 గంటలకు కదిరి నుంచి బయలుదేరి, పులివెందల, తాడిపత్రి, నంద్యాల, ఆత్మకూరు, దోరనాల మీదుగా మరసటి రోజు ఉదయం 7గంటలకు శ్రీశైలం చేరుకుంటుందన్నారు. ప్రతిరోజు రాత్రి 7.30 గంటలకు శ్రీశైలం నుంచి కదిరికి బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు బస్సు చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్న క్యాంటీన్ కోసం స్థల పరిశీలన



అన్న క్యాంటీన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ముదిగుబ్బ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ కోసం టీడీపీ నాయకులు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. ఈనెల 17న అన్నం కోసం నిరీక్షణ అనే కతనాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. ఇందుకు స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు ముదిగుబ్బలో అన్నక్యాంటీన్ ఏర్పాటుకు పంచాయతీ కార్యదర్శి మంజుల, వీఆర్వో నవీన్, సర్వేయర్ సందీప్‌తో కలిసి మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ స్థలాన్ని పరిశీలించారు.

దోమల నివారణకు చర్యలు



మురుగు కాలువలో స్ప్రే చేస్తున్న వైద్య సిబ్బంది

ఓబుళదేవరచెరువు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అపరిశ్రుభత వల్ల, మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగాయి. విషయాన్ని సోమవారం ఆంధ్రజ్యోతిలో బాబోయ్ దోమలు అనే శీర్షికతో ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన మలేరియా సబ్‌యూనిట్ అధికారులు, వైద్య బృందం, సిబ్బంది మండల కేంద్రంలో పర్యటించారు. బీసీ కాలనీ, తదితర ప్రాంతాల్లో మురుగునీరు నిలువ ఉన్నచోట అబేట్స్ స్ప్రే చేశారు. వారితోపాటు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బ్లీచింగ్ పౌండర్ చల్లారు. ఇంటింటి సర్వేతో పాటు లార్వా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందు, జిల్లా మలేరియా నివారణాధికారులు లక్ష్మీనాయక్, గోపినాయక్, వెంకటేశ్వర్లు, కదిరి మలేరియా సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

గాండ్లపెంట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లి, కమతంపల్లిలో పశువైద్యశిబిరాలు సోమవారం నిర్వహించినట్లు పశువైద్యాధికారి చెన్నకేశవులనాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జయరామక్రిష్ణారెడ్డి, కన్వీనర్ కొండయ్య, చంద్రశేఖర్, రామాంజులరెడ్డి, కేశవరెడ్డి, వెంకటరమణారెడ్డి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే 21న కటారుపల్లి, జీన్లకుం ట, 22న గొడ్డివెలగల, వేపరాల, 23న తుమ్మలబైలు, రెక్కమాను, 24న టి.పెద్దతండా, చామాలగొంది. 25న సాదులవాండ్లపల్లి, మల్లమీదపల్లి, 27న తూపల్లి, సామచేనుబైలు, 28న మద్దివారిగొంది, గాజులవారిపల్లితండా, 29న గాండ్లపెంట, శింగానివారిపల్లి, 30న నాయనవారిపల్లి, కురమామిడి, 31న బొల్లుగుంట్లపల్లి, పాయకట్టు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

● ఓబుళదేవరచెరువు: మండలవ్యాప్తంగా ఈనెల 31వరకు గ్రామాల వారీగా పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 21న గాజుకుంటపల్లి, గౌరాపురం, 22న పెద్దగుట్లపల్లి, డబురవారిపల్లి, 23న గొల్లపల్లి, తంగేడుకుంట, 24న తిప్పేపల్లి, బలిజపల్లి, 25న ఇనగలూరు, చౌడంపల్లి, 27న వెంకటాపురం, దిగువపల్లి, 28న మల్లాపల్లి, నాయనకోట, 29న దొన్నికోటవారిపల్లి, కుసుమవారిపల్లి, 30న మిట్టపల్లి, మద్దకవారిపల్లి, 31న టి.కుంట్లపల్లి, నవాబుకోట గ్రామాల్లో పశువైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

● బత్తలపల్లి : బత్తలపల్లి, ఈదులముస్టూరు గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాలను ఏడీ శ్రీనివాసులు, పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి నిర్వహించారు. ఈ వైద్యశిబిరాలను డిప్యూటీ డైరక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు.

తనకల్లు: మండలంలోని బాలసముద్రం, దిగువ తొట్లిపల్లి గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. బాలసముద్రం గ్రామంలో టీడీపీ బీసీ సెల్ నాయకులు సోంపాళ్యం నాగభూషణం, సీనియర్ నాయకులు బుగిడే చంద్ర ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కేశవయ్య, హరినాథ్‌రెడ్డి, శివశంకర్‌నాయక్, భాను, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది పనితీరుపై విచారణ

నంబులపూలకుంట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై సోమవారం ఏపీడీ రమేష్ విచారణ చేపట్టారు. గత వైసీపీ పాలనలో వలంటీర్లుగా పనిచేస్తున్న వారికి ఉపాధి బిల్లులు చెల్లించడం జరిగింది. మండలంలోని మర్రికొమ్మెదిన్నె, వెలిచెలమల, ఎన్పీకుంట క్షేత్రస్థాయి సిబ్బంది అవినీతికి పాల్పడ్డారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు ఏపీడీ, ఎంపీడీఓ అంజనప్ప, ఏపీఓ చంద్రశేఖర్ తెలిపారు. పది అంశాలను విచారించామని, నివేదికలను జిల్లా అధికారులకు పంపుతామని చెప్పారు.

అపరిశుభ్రత నివారణకు ప్రత్యేక చర్యలు

ధర్మవరం రూరల్: గ్రామాల్లో అపరి శుభ్రత నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ సాయి మనోహర్ సోమవారం తెలిపారు. మండలంలోని వెంకట తిమ్మాపురం గ్రామంలో రోడ్లపైనే మురుగునీరు నిల్వఉండటంతో గ్రామస్థులు ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన సంబంధిత గ్రామపంచాయతీ అధికారులతో మాట్లాడి శుభ్రం చేయించారు. అనంతరం బ్లీచింగ్ చల్లించి దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుం టున్నామన్నారు. ఎక్కడైనా మురుగునీరు నిల్వ ఉన్నా.. తాగునీరు రాకపోయినా, తాగునీటి లీకేజీలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే.. తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.


వెంకటతిమ్మాపురంలో మురుగునీటిని తొలగిస్తున్న సిబ్బంది

మా ఊరికి దారేదీ..!

- జొన్నలకొత్తపల్లి తండాకు రస్తా సమస్య
- చుట్టూ ప్రైవేటు భూములు.. మధ్యలో గ్రామం..
- పలువురు అధికారులు పరిశీలించినా తీరని సమస్య


జొన్నలకొత్తలపల్లి తండావాసులకు ఈ మార్గమే దిక్కు

ముదిగుబ్బ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలకొత్తలపల్లితండాకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆ తండా వాసులు నానా అవస్థలు పడుతున్నారు. కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో... జొన్నలకొత్తపల్లి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ తండా ఉంది. మొదటి నుంచి ఈ తండాకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. వ్యవసాయ పొలాల్లోనే దారులు ఏర్పాటు చేసుకుని రవాణా చేసేవారు. పంటలు సాగు చేసినప్పుడు రైలుపట్టాల పక్కన కాలిబాటును ఏర్పాటు చేసుకొని వెళ్తారు.

● అత్యవసరమైతే అంతే సంగతి: రాళ్లఅనంతపురం నుంచి తండాకు వెళ్లాలంటే రైల్వే ట్రాక్ దాటాల్సి ఉంది. ఈ ట్రాక్ దాటాలంటే.. రైల్వే అండర్ బ్రిడ్జి ద్వారానే వెళ్లాల్సి ఉంది. ఆ బ్రిడ్జి కూడా తక్కువ ఎత్తు ఉండటంతో ఆటోలు, బైక్‌లు మాత్రమే వెళ్తాయి. ట్రాక్టర్లు, లారీలు వెళ్లలేవు. కనీసం అంబులెన్స్ కూడా వెళ్లని పరిస్థితి ఉంది. దీంతో రోగులను, గర్భిణులను ఆ తండా నుంచి ఈ ట్రాక్ వరకు ఆటోలో తీసుకొని.. ట్రాక్ అటువైపు ఉన్న అంబులెన్స్‌లో ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సిన దుస్థితి ఉంది. ఈ మట్టి రోడ్డుకు కూడా ఇరువైపులా భారీ కంపచెట్లు పెరిగాయి. వర్షం పడితే.. ఆ మట్టిరోడ్డు బురదమయంగా మారి.. బైక్‌లు కూడా రాలేని పరిస్థితి. గత నెలలో తండాలో పింఛన్ పంపిణీ చేయడానికి వెళ్లిన అధికారి వాహనం నీటిలో ఇరుక్కుపోయింది.

● కొలిక్కిరాని సమస్య: జొన్నలకొత్తపల్లితండా ప్రజలు తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభం రవిబాబుకు విజ్ఞప్తి చేశారు. దీంతో రెండేళ్ల క్రితం జొన్నలకొత్తపల్లి తండాను పరిశీలించారు. త్వరలోనే తండాకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని తండావాసులకు హామీ ఇచ్చారు. గతంలో నాటి కలెక్టర్ అ రుణ్ బాబు తండాలో పర్యటించారు. తండావాసుల సమస్యను తెలుసుకుని రోడ్డు సమస్యను పరిష్కరించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెళ్లారు. ఎనిమిది నెలల క్రితం అప్పటి ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి కూడా తండాను పరిశీలించారు. రైతులతో మాట్లాడి రోడ్డు ఏర్పా టుచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చా రు. రెండు రోజుల క్రితం ప్రస్తుత ధర్మవరం ఆర్డీఓ మహేశ్ తండాలో పర్యటించారు. సంబం ధించి రెవెన్యూ అధికారులతో చర్చించి.. రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొన్నేళ్లుగా అధికారులు పర్యటించి రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తున్నారే కానీ... నేటికి రోడ్డు సౌకర్యం కల్పించడం లేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలో జొన్నలకొత్తపల్లి తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని తండావాసులు కోరుతున్నారు.


అధికారులతో వివరాలు ఆరాతీస్తున్న ఆర్డీఓ మహేశ్ (ఫైల్)

ప్రభుత్వం స్పందించాలి

ఆరేళ్ల నుంచి అనేక మంది అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా రస్తా సమస్య పరిష్కారం కాలేదు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్, కలెక్టర్, ఆర్డీఓల దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లాం. అయినా పరిష్కారం జరగలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా పాలకులు స్పందించాలి. రస్తా సమస్యను పరిష్కరించాలి.

-సేవేనాయక్, జిల్లా ఎస్టీ కార్యదర్శి

సమస్య ఎప్పుడు తీరుతుందో..


అనేక మంది నాయకులు, అధికారులు వచ్చారు. తండాకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇస్తారు. కాని ఇంతవరకూ అది కార్యరూపం దాల్చలేదు. రస్తా సమస్య ఇంతవరకూ పరిష్కారం కాలేదు. రస్తా ఏర్పాటు కలగానే మిగులుతోంది.

- రామాంజనేయులునాయక్, జొన్నలకొత్తపల్లితండా

అత్యవసర వేళలో ఇబ్బందులు


గర్భిణీలకు పురిటినొప్పులు వస్తే... ఎవరైనా రోగాల బారిన పడితే.. అనేక ఇబ్బందులు పడాల్సిందే. అంబులెన్స్‌ను రైల్వే అండన్‌బ్రిడ్జి బయటే ఉంచి ఆటోలోనో.. స్ట్రెక్చర్‌లో తండా నుంచి తీసుకువెళ్లాల్సి ఉంది.

-రమణమ్మ, జొన్నలకొత్తపల్లితండా

గొట్లూరులో వైభవంగా మహంకాళమ్మ ఉత్సవాలు


ముత్తైదువులకు ఒడిబియ్యం సమర్పణ


గ్రామోత్సవంలో వెండిరథంపై ఊరేగుతున్న అమ్మవారు .

ధర్మవరంరూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరులో వెలసిన మహంకాళమ్మ 13వ వార్షికోత్సవం, గ్రామోత్సవ వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఏటా సంక్రాంతి పండుగ తర్వాత మహంకాళమ్మ ఉత్సవాలను నిర్వహిస్తారు. అమ్మవారి మూలవిరాట్‌ను ఆలయ పూజారి కాటమయ్య రకరకాల పూలతో, వెండిగొడుగులతో అలంకరించారు. ఉత్సవాలు సందర్భంగా ఆలయంలో 500మందికిపైగా ముత్తైదువులకు ఒడిబియ్యం అందజేశారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కడప, నెల్లూరు, కర్ణాటక జిల్లాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. రాత్రి మహంకాళమ్మ అమ్మవారిని వెండిరథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.


వసతి గృహన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

గురుకుల పాఠశాల ప్రారంభం

పుట్టపర్తి రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో మహాత్మజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం రూ. 50 వేల విలువ చేసే ఫ్యాన్లు, ప్రొజెక్టర్, ఇన్వర్టర్, పరికరాలను ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆ పాఠశాల అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రమాదేవి, ఉపాధ్యాయులు, పట్టణ కన్వీనర్ రామాంజినేయులు, మునిసిపల్ మాజీ చైర్మన్లు పీసీ గంగన్న, బెస్తచలపతి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జయప్రకాష్, బేకరినాయుడు, అంబులెన్సు రమేష్, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● ఆదాయ వనరులపై దృష్టిపెట్టండి

మున్సిపాల్టీ అభివృద్ధికి ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి మునిసిపల్ అధికారులను ఆదే శించారు. సోమవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడు తూ.. మునిసిపాలిటీలో రూ.10 కోట్లకుపైగా ఆస్తి, ఇంటి, నీటి పన్నులు బకాయలు ఉన్నాయని, అయినా అధికారులు వాటిని వసూలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ప్రజల కోసం పనిచేయకపోతే ఎలాగని ప్రశ్నించారు. ఇక నుంచి మునిసిపల్ అధికారులు మునిసిపాలిటీకి రావాల్సిన అన్నిరకాల పన్నులపై దృష్టి సారించాలన్నారు. మునిసిపాలిటీ ఆస్తులు ఆన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆదేశించారు. శిల్పారామం కాలనీలో రూ.40లక్షలతో సీసీరోడ్లు, మినరల్ వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేయాలన్నారు. పడమర గేట్ రోడ్డు గుంతల మయంగా మారిందని, అందుబాటులో ఉన్న పుడా నిధులు రూ. 40 లక్షలతో మరమ్మతులు చేయాలని అధికారు లకు సూచించారు. పట్టణంలో డ్రైనేజి, తాగునీటి సమస్య, సత్యమ్మగుడి వద్ద వర్షపునీరు నిలువ ఉండకుండా చూడాలని కమిషనర్ ప్రహ్లాదను ఆదేశించారు. పట్టణంలో అనధికార లేఅవుట్లను గుర్తించి వాటిని క్రమబద్ధీకరించుకునే విధంగా నోటీసులు జారీ చేయాలన్నారు.

చిన్నారి కాలేయ మార్పిడికి చేయూత

రూ.10 లక్షలు మంజూరు చేయించిన మంత్రి


చెక్కును అందజేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఓ చిన్నారి కాలేయ మార్పిడి చికిత్స కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. పట్టణంలోని నేసేపేటకు చెందిన కొత్త అనిల్‌కుమార్, కొత్త అనిత దంపతుల కుమార్తె నిహాన్వి(3) పుట్టుకతో కాలేయ సమస్యతో బాధప డుతోంది. వైద్యుల సలహా మేరకు కాలేయ మార్పిడి చేయించాల్సిన ఉంది. దాని కోసం తగినంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. చిన్నారి చికిత్స కోసం సాయం అందించాలని కోరారు. హైదరాబాద్‌లోని గ్లెన్ ఈగల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ చిన్నారి కాలేయ మార్పిడి ఆపరేషన్ కోసం మంత్రి సీఎం సహాయ నిధి నుంచి వెంటనే రూ.10 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ తో పాటు మంత్రి లేఖను ధర్మవరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ హరీశ్ బాబు సోమవారం ఆ చిన్నారి ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జింకా చంద్రశేఖర్, సాకే ఓబిలేసు, డోలా రాజారెడ్డి, ఎర్రజోడు లోకేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇసుక డంపు పరిశీలన

నంబులపూలకుంట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవంకలవారిపల్లి సమీపంలో నిలువ ఉంచిన ఇసుక డంపును సోమవారం మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఇసుక డంపును ఇప్పటికే జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు కొలతలు సేకరించారు. 5,400 క్యూబిక్ మీటర్ల ఇసుక ఉందని అధికారులు నిర్ధారించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్, జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి పెద్దిరెడ్డి, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ పురుషోత్తమ్, మైనింగ్ సర్వేయర్ సునీతాబాయి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇజ్‌తెమా

తాడిమర్రి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక నిర్వహిస్తున్న ఇజ్‌తెమా కార్యక్రమానికి గతంలో ఎన్నడూలేని విధంగా ధర్మవరం, కదిరి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. ఆదివారం ఈ కార్యక్రమం ప్రారంభం కాగా, సోమవారం దాదాపు 50 వేలమంది ముస్లింలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు, దువ్వా నిర్వహించారు. ఇందుకు గాను ఇతర రాష్ట్రాల నుంచి కూడా ముస్లిం మతపెద్దలు హాజరయ్యారు. సాయంత్రం ఇచ్చిన దువ్వా కార్యక్రమంలో టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ముస్లిం మతపెద్దలతో కలిసి శ్రీరామ్ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగూర్ హుస్సేన్, రాము, రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి ,పక్కీర్‌రెడ్డి, మల్లి, వినోద్, సూరి పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్, ముస్లింలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తనకల్లు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరాకు వాండ్లపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లచెరువు మండలంలోని బొమ్మిరెడ్డిపల్లికి చెందిన ఓబులేసుకు తీవ్రంగా గాయపడ్డాడు. నల్లచెరువు నుంచి తనకల్లుకు ద్విచక్రవాహనంలో వస్తున్న ఓబులేసును ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన ఓబులేసును 108లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది


సచివాలయం బయట వేచి ఉన్న ప్రజలు

బత్తలపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబాపురం గ్రామంలో సచివాలయ అధికారులు సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం సచివాలయ సిబ్బంది ఉదయం 10గంటలకు విధులకు హాజరుకావాల్సి ఉంది. అయితే వారు ఉదయం 11 గంటలైనా విధులకు రారు. సోమవారం అనేక మంది సచివాలయానికి వచ్చా రు. 11 గంటలైనా అయిన సచివాలయానికి ఎవరూ రాలేదు. ఆ కార్యాలయానికి తాళాలూ కూడా తీయకపోవడంతో ప్రజలు బయ టే సిబ్బంది కోసం వేచిచూశారు. అప్పటికీ ఎవరూ రాకపోవడంతో పరిపాలన అధికారి శ్రీనివాసులుకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. సోమవారం ఫిర్యాదుల దినోత్సవం కావడంతో ప్రజలు అధిక సంఖ్యలో సచివాలయానికి వచ్చారు. అయినా సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాలేదు. విషయం తెలుసుకున్న ఏఓ శ్రీనివాసులు తంబాపురం సచివాలయ సిబందికి చార్జు మెమోలు ఇచ్చారు.

సబ్‌జైలు తనిఖీ


సబ్‌జైలును తనిఖీ చేస్తున్న దృశ్యం

ధర్మవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ సోమవారం తనిఖీ చేశారు. ఖైదీలు ఉండే గదులను, వంట గదిని పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ.. వసతులు సరిగా ఉన్నాయా లేదా... సరైన భోజనం అందిస్తున్నారా.. లేదా.. అని ఆరా తీశారు. ఉచితంగా న్యాయం సహాయం కావాలనుకునే వారు తమకు సమాచారం అందించవచ్చన్నారు. అనంతరం జైలులో ఉన్న పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట సబ్ జైలు సూపరింటెండెంట్ బ్రహ్మంరెడ్డి, న్యాయవాదులు కృష్ణమూర్తి, బాలసుదరి, పారాలీగల్ వాలంటరీ షామీర్‌బాషా ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ముదిగుబ్బ : మండలంలోని కొండ గట్టుపల్లి పంచాయతీలోని మద్దన్నగారిపల్లి, పైపేడు, పాయిగ ట్టుపల్లి, దేవరగుడిపల్లి, కోటిరెడ్డిపల్లి, పి.కొట్టాల, చెంచుగారిపల్లి గ్రామాలకు సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.39 లక్షలు నిధులు మంజూరైనట్లు టీడీపీ నాయకులు తెలిపారు. పైపేడు గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకులు చినగాని నరసింహయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం భూమిపూజ చేశారు. మారు మూల గ్రామం కావడంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వీటి గురించి పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేశ్‌బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, కోట్లబాబి, నాగిరెడ్డి, కిష్టయ్య, మోహన్, నరేంద్ర యాదవ్, రమణయ్య, శీనా, గనేనాయక్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ధర్మవరం: పట్టణంలోని 23వ వార్డుకు చెందిన టీడీపీ మహిళా కార్యకర్త హయాబి తమ్ముడు కాజు(35) అనారో గ్యంతో సోమవారం మరణిం చాడు. ఈ విషయాన్ని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ అడ్ర మహేశ్ చేనేత ప్రముఖుడు సంధా రాఘవ దృష్టికి తీసుకె ళ్లారు. ఆయన స్పందిం చి రూ.16వేలు ఆర్థికసాయాన్ని బాధత కుటుంబసభ్యులకు అందజేశారు.

న్యూస్ బాక్స్

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ



గోరంట్లలో రోడ్డు భద్రతపై ర్యాలీ చేస్తున్న పోలీసులు

గోరంట్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీసులు కళాశాల విద్యార్థులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఏపీఎస్ జూనియర్ కళాశాల నుంచి ప్రధాన రహదారిపై బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని, మద్యం సేవించి, సెల్‌ఫోనులో మాట్లాడుతూ వాహనం నడపరాదని పేర్కొన్నారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్, ఎస్ఐ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి



హిందూపురం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బోయపేట అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదేవి (53) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె 20 సంవత్సరాల నుంచి పిల్లలు, గర్భవతులు, బాలింతలకు ఎంతో సేవ చేశారని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ప్రాజెక్టు కార్యదర్శి శోభారాణి, అధ్యక్షురాలు అరుణ, సీఐటీయూ నాయకుడు రాము పేర్కొన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ సేవలు

రొళ్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం నుంచి వారం రోజుల పాటు మొబైల్ ఆధార్ సేవలు అందించనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం హొట్టేబెట్ట సచివాలయంలో మొబైల్ ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా 22న రొళ్ల సచివాలయంలో, 23న బి.జి.హళ్లిలో, 24న రత్నగిరిలో, 27న హొట్టేబెట్టలో, 28న రొళ్లలో, 29న బి.జి.హళ్లి, 30న రత్నగిరిలో నిర్వహిస్తామన్నారు. ఈక్యాంప్‌లను ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2011 సంవత్సరం నుంచి 2016 మధ్యలో ఆధార్ తీసుకొన్నవారు కొత్తగా ఎన్‌రోల్ చేయించుకోవాలన్నారు.

అధికారులతో నేడు మంత్రి సమీక్ష

గోరంట్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ శాఖల అధికారులతో మంగళవారం బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వినాయక్‌నగర్ కేఎస్‌బీ ఫంక్షన్‌హాలులో మధ్యాహ్నం 2.30 గంటలకు సమీక్షా సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, సచివాలయ, ఉపాధి సిబ్బంది హాజరు కావాలని పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

గోరంట్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరి రహదారిలో నిమ్మల యువశేఖర్ ఇంటి ముందు ఉంచిన స్కూటీని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు వాహనదారుడు ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

పెనుకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ శాంతలక్ష్మీ తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ నరేష్ అధ్యక్షతన బాల్య వివాహాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహరహిత మండలంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతలు తీసుకోవాలన్నారు. చిన్నవయసులోనే వివాహాలు చేయడంతో శారీరక, మానసిక ఒత్తిడికి గురై తల్లిబిడ్డ ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో టీమ్‌లీడర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

రొళ్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపల్లికి చెందిన చంద్రప్ప బ్రెయిన్‌స్ట్రోక్‌తో బాధపడుతున్నాడని తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి ద్వారా రూ.25వేలు నగదు అందించారు. చంద్రప్ప విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా ఇతర ఖర్చులు కూడా భరిస్తామని పార్టీ నాయకుల ద్వారా తెలియజేశారు.

ఎట్టకేలకు ఏఈ నియామకం

అగళి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అగళి మండలానికి విద్యుత్‌శాఖ ఏఈని నియమించారు. గత రెండేళ్లుగా మండలంలో విద్యుత్ శాఖ ఏఈ లేక రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చొరవతో ఉన్నతాధికారులతో చర్చించడంతో ఏఈగా నాగరాజుని నియమించారు. ఈయన పుట్టపర్తిలో పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల సహకారంతో మండలంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఏఈ పేర్కొన్నారు.

కన్నులపండువగా శ్రీనివాస కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విష్ణు సహస్ర నామ సత్సంగ మండలి ఆధ్వర్యంలో సోమవారం ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని వేదికపై స్వామివార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, విష్ణు సహస్రనామ సత్సంగ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎయిడ్స్ నియంత్రణ కేంద్రం

● పెచ్చులూడి పడుతున్న వైనం ● కిటికీలకు అట్టముక్కలు అడ్డుపెట్టి విధులు



హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి, పెచ్చులూడిన దృశ్యం, కిటికీకి అడ్డుగా పెట్టిన అట్టముక్కలు

హిందూపురం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్న హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ ఆసుపత్రికి హిందూపురం పట్టణం, చుట్టుపక్కల గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాలైన గోరంట్ల, పెనుకొండ, మడకశిర ప్రాంతాల నుంచి ఎక్కువగా రోగులు వస్తుంటారు. పక్కనే ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి కూడా చాలా మంది హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ వైద్య సేవల కోసం వస్తుంటారు. ఆసుపత్రి ముఖద్వారంలోనే ఎయిడ్స్ నియంత్రణ కేంద్రం ఉంది. అది శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉంది. తరచూ పై నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. అందులోనే కూర్చుని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు పెచ్చులు ఊడి మీద పడతాయో అని భయం భయంగా కాలం గడుపుతున్నారు. సిమెంట్ పెచ్చులు ఊడి తలపై పడితే ఆదే ఆసుపత్రిలో చేరాల్సి వస్తుందేమో అని ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే పై నుంచి నీరు కారి గదులన్నీ జలమయమవుతున్నాయి. కిటికీలు ధ్వంసమై విరిగిపోయాయి. చలి, గాలి, వానకు అలాగే పని చేయియాల్సి వస్తుంది. దీంతో సిబ్బంది తాత్కాలికంగా కిటికీలకు అట్టముక్కలు అడ్డుపెట్టి విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం ఆసుపత్రిపై ఎలాంటి శ్రద్ధ చూపకపోవడంతో చాలా వరకు లీకేజీ అవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రిని గాలికి వదిలేసింది. దీంతో చాలా వరకు భవనాలు లీకేజీల పర్వంగా మారాయి. ఇటీవల విజయవాడ నుంచి ఇంజనీర్లు కూడా వచ్చి అన్నింటిని పరిశీలించి వెళ్లారు. ఇప్పటికే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆసుపత్రిని పరిశీలించాలని, మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని స్థానిక సిబ్బంది కోరుతున్నారు.

నివేదికలు పంపించాం: లింగణ్ణ, సూపరింటెండెంట్

నెల క్రితమే ఆసుపత్రిలో కొన్ని సివిల్ పనులకు నివేదికలు పంపించాం. అక్కడక్కడ లీకేజీల మరమ్మతులు చేపడుతున్నాం. బడ్జెట్ త్వరలో విడుదలవుతుందని తెలిసింది. అది రాగానే పనులు చేపట్టి ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా మరమ్మతులు చేపడతాం.

టీడీపీతోనే చేనేతకు పూర్వవైభవం

● బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ● 24 మందికి రూ.14.40 లక్షల చెక్కుల పంపిణీ



చేనేతలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీతోనే చేనేతకు పూర్వ వైభవం సాధ్యమని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని చౌడేశ్వరి కల్యాణమండపంలో స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా 24 మంది చేనేతలకు రూ. 14.40 లక్షలు వర్క్‌షెడ్ల నిర్మాణానికి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోమందేపల్లిలో 164 మంది చేనేత కార్మికులకు చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేశామన్నారు. హిందూపురం, ధర్మవరంలో చేనేత క్లస్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా 50 సంవత్సరాలు పైబడిన వారికి రూ.4వేలు పెన్షన్ అందజేస్తామన్నారు. చేనేత వృత్తిపై ఆధార పడిన వారికి రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు బ్యాంక్ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం 80 మంది చేనేతలకు రూ.21.47లక్షల విలువచేసే 240 హంక్స్, జాకార్డ్, మోటార్స్ కూడిన లిఫ్టింగ్ మిషన్ పరికరాలు ఫ్రేమ్‌రూమ్ సెట్స్ అందించారు. ప్రతి చేనేత సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అధికారులు, నాయకులు, చేనేతలు పాల్గొన్నారు.

జేఈ వెంకటస్వామి మృతి తీరనిలోటు

● ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ● కుటుంబ సభ్యులకు పరామర్శ



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నందమూరి బాలకృష్ణ

హిందూపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జేఈ వెంకటస్వామి మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ఇటీవల మృతిచెందిన వెంకటస్వామి కుటుంబాన్ని సోమవారం రాత్రి బాలకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి కుటుంబ సభ్యులు మాజీ మునిసిపల్ చైర్మన్ అనిల్‌కుమార్, వేణుతో కలిసి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ఆయన ఎంతగానో పరితపించే వ్యక్తి అన్నారు. ఎప్పుడు తాను హిందూపురం వచ్చినా పట్టణాభివృద్ధికి తన దృష్టికి తీసుకొచ్చేవాడన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయడంలో ఆయన పాత్ర ఉందన్నారు. బాలకృష్ణ హిందూపురం రావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఆయనకు బొకేలు అందజేసి స్వాగతం పలికారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ నేటి పర్యటన వివరాలు..

ఎమ్మెల్యే బాలకృష్ణ మంగళవారం ఉదయం లేపాక్షిలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేయనున్నారు. చిలమత్తూరు మండలం బ్రహ్మేశ్వరంపల్లిలో వాటర్‌ట్యాంక్ ప్రారంభిస్తారు. అనంతరం చిలమత్తూరులో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తారు. దిగువపల్లి తండాలో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం వివాహ వేడుకల్లో పాల్గొంటారు. బుధవారం హిందూపురం పట్టణంలోని మోతుకపల్లివద్ద నూతనంగా నిర్మించే సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ, అనంతరం కిరికెర వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ, గోళ్లాపురం వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొని అనంతరం అనంతపురం వెళ్లనున్నారు.

మహిళా పోలీసులకు అవగాహన

పరిగి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నేరాలపై మండల పరిధిలోని సచివాలయ పోలీసులకు సోమవారం ఎస్ఐ రంగడు యాదవ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు, సైబర్ నేరాలు పలు అంశాలపై గ్రామాలలో ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా ఉద్యోగులు, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

10 గొర్రెల అపహరణ

పరిగి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాసనకోట గ్రామానికి చెందిన చిన్నఓబులప్ప ఇంటి వద్ద నుంచి ఆదివారం రాత్రి 10 గొర్రెలను దుండగులు అపహరించారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. రాత్రి సమయంలో ఇంట్లో ఉండగా బయటి నుంచి గొళ్లెం పెట్టి గొర్రెలను తోలుకెళ్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. వీటి విలువ రూ.లక్ష దాకా ఉంటుందన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సొసైటీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

● కార్మిక సంఘాల నాయకుల డిమాండ్



ధర్నా చేస్తున్న సొసైటీ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సొసైటీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ అనుబంధ ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, హరికృష్ణ మాట్లాడారు. 2019లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 36ను అమలు చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ వచ్చిందన్నారు. దీంతో సొసైటీ ఉద్యోగులు హెచ్‌ఆర్ పాలసీ వర్తింపచేయక పోవడంతో తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రయ్య, శ్రీరాములు, మలరాయుడు, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు సొసైటీ ఉద్యోగుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, నాయకులు హనుమంతరెడ్డి, రామాంజినేయులు, దామోదర్, తాడిపత్రి శ్రీనివాసులు, నరేంద్రరెడ్డి, బొజ్జప్ప పాల్గొన్నారు.

ముగ్గురు అధికారులు.. మూడు అర్జీలు



పాల్గొన్న ముగ్గురు అధికారులు

రొళ్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు స్పందన కరువయింది. రొళ్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ముగ్గురు అధికారులు పాల్గొన్నారు. మూడే అర్జీలు వచ్చాయి. మండల అధికారులు అందరూ పాల్గొనాల్సి ఉండగా.. తహసీల్దార్ షేక్షావలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మండల స్థాయి అధికారులు ముఖం చాటేస్తుండడంతో దా నికి స్పందన కరువవుతోంది. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ/పెనుకొండ టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గోరంట్ల మండలం పెరుమాళ్లపల్లి క్రాస్‌వద్ద 152 హేవార్డ్స్ విస్కీ 90 కర్ణాటక మద్యం, రెండు ద్విచక్రవాహనాలతోపాటు ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినటు వివరించారు. మరో వ్యక్తి పరారైనట్లు తెలిపారు. దాడుల్లో జిల్లా ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి అలిబేగ్, ఎస్ఐ వీజీ రాముడు తదితరులు పాల్గొన్నారు. కర్ణాటక మద్యం అమ్మినా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమందేపల్లి మండలంలో కూడా దాడులు నిర్వహించామన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన సదస్సు

అగళి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి లక్షణాలు కనిపించేందుకు ఐదు నుంచి ఏడు సంవత్సరాలు పడుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వేచేసి ప్రతి ఒక్కరిని పరీక్షించాలని సిబ్బందికి సూచించారు. ఫిబ్రవరి 2వరకు మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ నమోదు చేయాలని తెలిపారు. అనంతరం అగళి మండలం కేంద్రంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, నరసారెడ్డి, ఏఎన్ఎంలు ఎంపీహెచ్‌ఎల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



నాయకులకు టీడీపీ కండువాలు వేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండల వైసీపీ మాజీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప సహా 27 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం వీరికి పెనుకొండ టీడీపీ కార్యాలయంలో మంత్రి సవిత కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల్లో అభివృద్ధి చూసి పార్టీలోకి వస్తున్నామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని తెలిపారు. మంత్రి సవిత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సోము, బాలకృష్ణచౌదరి, నరేష్, శ్రీధర్, అశోక్ పాల్గొన్నారు.

రైతుల భాగస్వామ్యంతో రీసర్వే



భూమిని సర్వే చేస్తున్న అధికారులు

మడకశిర రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రైతుల భాగస్వామ్యంతో సోమవారం భూముల రీసర్వే ప్రాంభించినట్లు తహసీల్దార్ కరుణాకర్, మండల సర్వేయర్ హరీష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో ఆమిదాలగొంది పంచాయతీని ఎంపికచేసినట్లు వివరించారు. పంచాయతీలో మొత్తం 7,700 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. ఐదు సర్వే టీమ్‌లు ఏర్పాటు చేసి రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని తెలిపారు. తొలిరోజు రైతు తిప్పేస్వామి సమక్షంలో భూములను సర్వేచేశామన్నారు.

హిరేతుర్పిలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

గుడిబండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిరేతుర్పి గ్రామంలో సోమవారం వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని సూచించారు. మహిళలు వాల్మీకి మహర్షికి హారతులు మోసి మొక్కుబడులు తీర్చుకొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, మద్దనకుంటప్ప, మంజునాథ్, దుర్గేష్, శివకుమార్, లక్ష్మీనరసప్ప, కరియణ్ణ, భోజరాజు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ఆర్డీటీ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఆన్‌కిల్

మడకశిర రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే ఆర్డీటీ ధ్యేయమని ఆ సంస్థ ప్రతినిధి ఆన్‌కిల్ పేర్కొన్నారు. మండలంలోని వైబీ హళ్లి ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన 37 గృహాలను సోమవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆర్డీటి పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క ఇల్లు రూ.2.85 లక్షలతో మొత్తం 37 ఇళ్లను నిర్మించి ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్లు మల్లికార్జున, రఘురాం, సీడీసీ సభ్యులు యోగానంద్ పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

మడకశిర టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ దేవాలయాల్లో సోమవారం ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, షిరిడీ సాయినాథుడి ఆలయంతోపాటు చంద్రమౌళేశ్వరస్వామి తదితర ఆలయాల్లో విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆకుపూజ అలంకరణ చేశారు.

నరసింహస్వామికి జ్యోతుల ఉత్సవం

లేపాక్షి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో వెలసిన నరసింహస్వామికి సోమవారం గ్రామస్థులు జ్యోతులను మోశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇల్లు బంధువులతో కిటకిటలాడింది. మహిళలతో భక్తిశ్రద్ధలతో ఆలయం నుంచి పురవీధుల్లో జ్యోతులు మోసారు. అనంతరం ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిసంవత్సరం ఇలా జ్యోతులు మోయడంతో పశువుల, ప్రజలు ఆనందంగా ఉంటారని గ్రామస్థులు తెలిపారు.



జ్యోతులు మోస్తున్న ప్రజలు